## క్లుప్తంగా

### ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయాధికారులు

**బంగారుపాళెం:** అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని చిత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఉమ దుకాణదారులను హెచ్చరించారు. మండల కేంద్రంలోని శనివారం ఎరువుల దుకాణాల్లో అధిక ధరలకు యూరియా విక్రయించడంపై తనిఖీలు నిర్వహించి విచారణ చేశారు. ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా రైతులకు ఎరువులు, యూరియా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హసీనా

**యాదమరి:** విద్యార్థులు ఆరోగ్యంపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని అపోలో యూనివర్సిటీ హెల్త్ క్లబ్ ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్ డాక్టర్ హసీనా తెలిపారు. మండలంలోని హోప్ చిల్డ్రన్స్ హోమ్‌లోని విద్యార్థులకు శనివారం అపోలో యూనివర్సిటీ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్యం, జీవన విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెల్త్ క్లబ్ స్టూడెంట్స్ వర్షిక, మధుమిత, దిలీప్ కుమార్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో విద్యార్థులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కో–ఆర్డినేటర్ జి.నవ్యశ్రీ, స్నేహిత, కిషోర్, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

### పనిభారం తగ్గించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

**గుడిపాల:** పంచాయతీ కార్యదర్శులందరూ పని ఒత్తిడి వల్ల మానసిక వేదనకు గురవుతున్నామని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. పనిభారం తగ్గించాలని కోరుతూ శనివారం పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో శివరాజన్‌కు వినతిపత్రమిచ్చారు. వారు రెండో శనివారం, ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో కూడా పంచాయతీ కార్యదర్శులు వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వం నిర్దేశిస్తున్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పండుగలు, సెలవు రోజుల్లో కూడా కుటుంబ సభ్యులతో సమయం గడపలేక పని ఒత్తిడి వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని వివరించారు.

# అడుగడుగునా అవమానాలు




- రగిలిపోతున్న సచివాలయ ఉద్యోగులు
- ఆత్మాభిమానం దెబ్బతీస్తున్న కూటమి ప్రభుత్వం
- సర్వేల కోసం ఇల్లిల్లూ తిరుగుతున్న వైనం
- పెరిగిన పనిభారం.. భవిష్యత్ అంధకారం

**ఐరాల:** గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కళకళలాడిన గ్రామ సచివాలయ వ్యవస్థకు అపవాదులు అంటగడుతూ వాటిని నిర్వీర్యం చేయడానికి కూటమి సర్కారు కంకణం కట్టుకుంది. సచివాలయ ఉద్యోగులు పనిలేక ఖాళీగా ఉంటున్నారంటూ ప్రచారం చేసింది. వలంటీర్లను తొలగించి ఆ పని భారాన్ని మొత్తం సచివాలయ ఉద్యోగులపై మోపింది. ఇప్పుడు సర్వేల పేరుతో వారిని ఇల్లిల్లూ తిప్పుతోంది. ప్రభుత్వం ఈ సర్వేల పేరుతో ప్రభుత్వ పథకాలకు గండి కొడుతుందన్న ఉద్దేశంతో ప్రజలు వారికి సహకరించడం లేదు. ఓటీపీలు చెప్పడం లేదు. మరి కొందరు సర్వే లేదు ఏం లేదు బయటకు పొండి అంటూ వెళ్లగొడుతున్నారు. ఈ అవమానాలు భరిస్తూనే ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పొందిన గౌరవం, ఈ ప్రభుత్వంలో లేకపోగా, పనిభారం, అవమానాలు ఎక్కువయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ ఉద్యోగులు తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక లోలోన కుమిలిపోతున్నారు. జాబ్‌చార్ట్‌తో సంబంధం లేని విధులు అప్పగిస్తూ తమను హీనంగా చూస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. రోజువారీ పనితో పాటు సర్వేలు, సమాచార సేకరణ పేరుతో కూటమి ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరుగుతున్న కారణంగా ఆందోళనకు గురవుతున్నారు. గత కొద్ది రోజులుగా ఎంఎస్‌ఎంఈ సర్వే, పీఏసీ సర్వే, జియో ట్యాగింగ్ సర్వే, పీ 4 సర్వే, మిస్సింగ్ సిటిజన్ సర్వే, డెత్ రీ వెరిఫికేషన్ సర్వే, ప్రస్తుతం వర్క్ ఫ్రం హోమ్ సర్వే, నాన్ ఏపీ రెసిడెన్స్ సర్వే, ఇంటి పన్నులు, నీటి పన్నుల వసూళ్లను అంటగడుతున్నారు. సర్వేల పేరుతో బండ చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తయిన సందర్భంగా వారం రోజుల పాటు గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులతో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించే పని అప్పగించి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది. నియోజకవర్గంలో సుమారు 1,400 మంది వలంటీర్లతో కలిసి 820 మంది సచివాలయ ఉద్యోగులు చేస్తున్న పనులను కూటమి ప్రభుత్వంలో కేవలం ఉద్యోగులతో మాత్రమే చేయిస్తుండటంపై వారిలో అసంతృప్తి జ్వాల రగులుతోంది.

**పింఛన్ల పంపిణీతో ఒత్తిడి**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీన వేకువజామునే వలంటీర్లతో ఠంఛన్‌గా పింఛన్ అందించేవారు. నేడు ఆ పనిని సచివాలయ ఉద్యోగులకు అప్పగించింది. వేకువజామునే మహిళా ఉద్యోగులు రూ.లక్షల నగదు తీసుకుని పంపిణీ కోసం వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. మండలంలో మారుమూల ప్రాంతాల్లో అక్కడక్కడా విసిరేసినట్లు ఉండే గృహాల్లోని లబ్ధిదారుల వద్దకు వెళ్లాలంటే ఆపసోపాలు పడుతున్నారు. గతంలో వలంటీర్లకు 50 నుంచి 60 కుటుంబాలు మాత్రమే ఉండగా రెండు క్లస్టర్లు కలిపి అంటే సుమారు 100 నుంచి 150 కుటుంబాల బాధ్యతను సచివాలయ సిబ్బందికి అప్పగించారు.

**ప్రమోషన్ చానల్ లేదు**

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు డిపార్టుమెంట్, సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేయలేదు. ప్రమోషన్ చానల్ ఏర్పాటు లేదు. సరైన జాబ్‌చార్ట్, పనివేళలు లేవు, సెలవుల అమలు లేవు, పబ్లిక్ హాలిడేస్, హెల్త్ కార్డు, ఇన్సూరెన్స్ బాండ్లు లేవు. కూటమి ప్రభుత్వం వీటిపై స్పష్టత ఇవ్వకుండా ఒక మల్టీపర్పస్ ఉద్యోగిగా వాడుకునేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోందనే ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల మంది ఉద్యోగులు ఉండగా వ్యవసాయశాఖలో ఉన్న కేవలం 250 మందికి మాత్రమే పదోన్నతులు వచ్చాయి. అందరూ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్, బీటెక్‌లు చదివి ఉద్యోగంలోకి వచ్చిన వారే. వారందరినీ వలంటీర్ల స్థాయికి దిగజార్చే ప్రక్రియను ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం చేస్తుందనే భావన ఏర్పడుతోంది.



మండలంలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

### ఉద్యోగులపై కక్ష సాధింపులు

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సచివాలయ ఉద్యోగులకు గౌరవం లేకపోగా, అవమానం అధికమైందని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. ఇప్పటికే కొందరు ఉద్యోగులు బహిరంగానే నిరసన తెలియజేస్తూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. గత ప్రభుత్వంలో ప్రతిపక్షంగా ఉన్న ఇప్పటి ప్రభుత్వం వలంటీర్లతో స్టిక్కర్లు అంటించడాన్ని కోర్టులో సవాల్ చేసిందని, మరి ఇప్పుడు వలంటీర్లను విధుల్లోకి తీసుకోకపోగా ఉద్యోగులనే స్టిక్కర్లు అంటించే బాధ్యతలు ఎలా అప్పచెబుతున్నారని ప్రశ్నిస్తున్నారు. తొలుత ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇవ్వమన్నారు. ఆ తర్వాత పాఠశాలల్లో టాయిలెట్ల ఫొటోలు తీయమన్నారు. ఇలా వారి అడుగడుగునా అవమానాలపాలు చేస్తూ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోంది.



పనిభారం తగ్గించాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ కార్యదర్శులు (ఫైల్)

## విద్యార్థులు సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి



గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

**చిత్తూరు కలెక్టరేట్:** ఎదుగుదలలో ఎదురయ్యే సవాళ్లను విద్యార్థులు ధైర్యంగా ఎదుర్కోవాలని గ్రావిటా ఇండియా లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ఏవీ శర్మ అన్నారు. నగర సరిహద్దులో ఉన్న విజయం బిజినెస్ స్కూల్‌లో శనివారం ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ కార్పొరేట్ ప్రపంచంలో నిరంతర అభ్యాసం ముఖ్యమన్నారు. ప్రస్తుతం అభివృద్ధి చెందిన టెక్నాలజీని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. చైర్మన్ తేజోమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో జీవితంలో రాణించాలని చెప్పారు. ఉన్నతాశయంతో ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ శైలజ, ప్రిన్సిపల్ జీవరత్నంనాయుడు పాల్గొన్నారు.

## విద్యతోనే సమాజంలో గౌరవం



ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు

**గుడిపాల:** విద్య ద్వారా సమాజంలో గౌరవం లభిస్తుందని మండల విద్యాశాఖాధికారి గణపతి అన్నారు. కమ్మతిమ్మాపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం వార్షికోత్సవం, వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణే ఆయుధాలన్న విషయాన్ని విద్యార్థులు మరవకూడదన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల్ని ఆదర్శంగా తీసుకొని, ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఏటా మంచి మార్కులు సాధిస్తున్నారని, ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని చెప్పారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు భానుప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలన్నారు. ఎంతో కష్టపడి చదివించే తల్లిదండ్రుల కలల్ని సాకారం చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

## టెన్త్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం

**తవణంపల్లె:** మండలంలో ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు సర్వంసిద్ధం చేశారు. మండలంలో తవణంపల్లె హైస్కూల్, అరగొండ బాలుర హైస్కూల్లో పదవ తరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తవణంపల్లెలో హైస్కూల్ విద్యార్థులు 86 మంది, వినాయక విద్యామందిర్ పాఠశాల విద్యార్థులు 80 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. అరగొండ బాలుర హైస్కూల్ పరీక్ష కేంద్రంలో వెంగంపల్లె, తొడతర, కృష్ణాపురం హైస్కూల్, నల్లంగాడు, అపోలో ఇషాస్కూల్, అరగొండ బాలుర హైస్కూల్, అరగొండ బాలికల హైస్కూల్‌కు చెందిన 211 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఎంఈఓ హేమలత మాట్లాడుతూ మండలంలో టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

**పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి**

**యాదమరి:** పదో తరగతి పరీక్షలకు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని మండల విద్యాశాఖాధికారి -1 రుక్మిణమ్మ పేర్కొన్నారు. ఆమె స్థానిక ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి పరీక్షల ఏర్పాట్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈసారి 370 విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గిరిరాజ, త్రివేణి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.







అరగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పదవ తరగతి పరీక్షలకు సిద్ధంగా ఉన్న డెస్క్‌లు, విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

### పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రి అందజేసిన సర్పంచ్

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే పదో విద్యార్థులకు శనివారం సర్పంచ్ త్యాగరాజులు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. మొత్తం 65 మంది విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్‌తోపాటు ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

### వరసిద్ధునికి విరాళం



విరాళం అందజేస్తున్న రామచంద్రరావు

**కాణిపాకం:** కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన నిత్య అన్నదానానికి శనివారం తెనాలికి చెందిన రామచంద్రరావు, చిత్తూరు గిరింపేటకు చెందిన సుభాషిణి రూ.లక్ష చొప్పున నగదును అన్నదానం ట్రస్టుకు విరాళంగా అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ సిబ్బంది ప్రత్యేక స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



విరాళం అందజేస్తున్న సుభాషిణి

## వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న కోదండయ్య

**చిత్తూరు కార్పొరేషన్:** ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరులో శనివారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, గౌరవ అధ్యక్షులు నాగరాజు మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ సమావేశం అధ్యక్షురాలు యస్.జయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. మహిళ కార్మికులకు సరైన జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్మికులపై కక్షకట్టి వారిని మార్చాలని చూడటం మానుకోవాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, రమాదేవి, మణి, లతరెడ్డి, రాజేశ్వరి, రాణి, సెల్వి, సుశీల, సుమ, మహాలక్ష్మి, ఢిల్లీ, సరస్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భవతులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రియాంక

**తవణంపల్లె:** గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండలంలోని తొడతరలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో గర్భవతులకు ప్రత్యేక పరీక్షలు చేయించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

**జాగ్రత్తలు తీసుకోవాలి**

వేసవి కాలం సమీపిస్తుండడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని ఉప్పాంకలో రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళల భద్రతకు 'శక్తి' బృందాలు

**చిత్తూరు అర్బన్ :** మహిళలు, బాలికల భద్రతతో పాటు ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి 'శక్తి' బృందాలు పని చేస్తాయని చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. శనివారం నగరంలోని మహిళా పోలీస్ స్టేషన్‌లో జిల్లాలో చిత్తూరు సబ్–డివిజన్‌లో 3, నగరి, కుప్పం, పలమనేరుకు ఒక్కో శక్తి బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఓ ఎస్‌ఐతో పాటు ఏఎస్‌ఐ, ఏడుగురు సభ్యులుగా ఉంటారన్నారు. మహిళలపై వేధింపుల నివారణకు ఈ బృందాలు పనిచేస్తాయన్నారు. మఫ్టీలో కళాశాలలు, బస్టాండు, రైల్వే స్టేషన్లు, ఇతర చోట్ల తిరుగుతూ.. మహిళలకు ఇబ్బంది వచ్చినప్పుడు వెంటనే ఈ బృందాలు ప్రతిస్పందిస్తాయన్నారు. ఎస్పీ ఎప్పటికప్పుడు ఈ బృందాల పనితీరును పర్యవేక్షిస్తుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మేజిస్ట్రేట్ తోట నాగరాజు, డీఎస్పీలు విజయశేఖర్, సాయినాథ్, సీఐ మహేష్, జయరామయ్య, నెట్టి కంటయ్య పాల్గొన్నారు.

# స్వచ్ఛాంధ్ర కోసం పాటుపడదాం





కాణిపాకం: ర్యాలీ చేస్తున్న ఆలయ సిబ్బంది, బంగారుపాళెం: ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

**కాణిపాకం:** కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తొలుత సిబ్బందితో ప్రతిజ్ఞ చేశారు. తర్వాత ఆలయ పరిసర ప్రాంతాల్లో ర్యాలీ చేశారు. బస్టాండు, డార్మెటరీ హాల్ ప్రాంతాల్లో పరిశుభ్రత చేపట్టారు. హోటళ్లు, తోపుడు బండ్ల షాపుల్లో ప్లాస్టిక్ వినియోగించరాదని ఈవో పెంచల కిషోర్ సూచించారు. అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వం వారి స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర జ్యూట్ బ్యాగులను భక్తులకు వితరణ చేశారు. కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు ధనంజయ, కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ప్రసాద్, హరి మాధవరెడ్డి, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, రంగస్వామి, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

**బంగారుపాళెం:** స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధనుంజయరాజు అన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో భాగంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాఠశాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు నాలుగు రోడ్లకూడలి వరకు ర్యాలీ చేశారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవ హారంగా ఏర్పడి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి నెలా మూడో శనివారం ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతను బాధ్యతగా భావించాలన్నారు. మొక్కలు నాటి స్వచ్ఛ గ్రామాలుగా మార్పు చేసేందుకు కృషి చేయాలన్నారు.

**ఐసీటీసీ కేంద్రంలో పారిశుధ్య పనులు**

స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఐసీటీసీ పరిసరాల్లో పారిశుధ్య పనులు నిర్వహించారు. ఐసీటీసీ కౌన్సిలర్ బాబు మాట్లాడుతూ, మనం ఉంటున్న పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది జయచంద్ర, శివ కుమార్, ప్రకాష్, భువన పాల్గొన్నారు.

**చెత్తను పడేయొద్దు**

**గుడిపాల:** ఇళ్లలోని చెత్తను ఎక్కడబడితే అక్కడ పడేయొద్దని, పారిశుధ్య కార్మికులు వచ్చినప్పుడు చెత్త బండ్లలోనే వేయాలని పంచాయతీ కార్యదర్శి సుందరేషన్ ప్రజలను కోరారు. మండల కేంద్రంలో శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా టబ్బుల్లో నిల్వ ఉంచుకొని పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. పరిశుభ్రత విషయంలో ప్రత్యేకశ్రద్ధ చూపించాలని చెప్పారు. ఒకసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించాలన్నారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వెలుగుశాఖ అధికారులు పాల్గొన్నారు.

**ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలి**

**యాదమరి:** మండల కేంద్రంలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని మండల అధికారులు ఘనంగా నిర్వహించారు. యాదమరి– గుడియాత్తం ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో వేణు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం పెరిగి అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారన్నారు. ప్రకృతిపై కూడా ఇది పెనుప్రభావం చూపుతోందని చెప్పారు. ప్రజలందరూ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి, ఏఓ చరిత, ఏపీఎం బాల పాల్గొన్నారు.



గుడిపాల: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



యాదమరి: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

### ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



ఆస్పత్రి సిబ్బందికి తగు సూచనలు చేస్తున్న అనిల్‌కుమార్

**గుడిపాల:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆర్‌సిహెచ్ (ప్రత్యుత్పత్తి శిశుఆరోగ్యం) జాయింట్ డైరెక్టర్ అనిల్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆరోగ్యకేంద్రంలో కాన్పులగది, ఔషధాల నిల్వ గది, రక్తపరీక్షల గదిని పరిశీలించారు. ఆస్పత్రిలో ఉన్న సిబ్బందికి హెచ్‌ఎమ్‌ఐఎస్, సీఎస్‌ఎస్‌ఎమ్, ఆర్‌సీహెచ్ సర్వీసులు గురించి వారికి వివరించారు. ప్రజలకు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి గ్రామంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో నిల్వ ఉంచిన ఔషధాలను తనిఖీచేసి కాలపరిమితి ఉందా లేదా తనిఖీచేశారు. ఆయనతో డాక్టర్ సంధ్య, సూపర్‌వైజర్ నరేష్, సీహెచ్ఓ బాల సూర్యనారాయణ, సూపర్‌వైజర్ విజయ ఉన్నారు.